ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0, కనిష్ఠం 22.0

నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 29 అక్టోబరు 2024

నేడు ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024 ద్వారా ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్) 1/3 అభ్యర్థుల జాబితా ప్రకారం లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులు మంగళవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం రూమ్ నెంబర్ 103లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేసి తీసుకురావాలని ఆయన తెలిపారు.



లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

ప్రైవేటుకు ధాన్యం విక్రయాలు

- కొనుగోలు కేంద్రాలను ప్రారంభించని ప్రభుత్వం
- గత ఏడాది ఈ పాటికే ధాన్యం సేకరణ ప్రారంభం

మోపాల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. అధికారులు మాత్రం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో అనేక మంది రైతులు ప్రైవేటు రైస్‌మిల్స్‌కు అమ్ముకుంటున్నారు. పంటను కోసి రోడ్లపై, పొలాల్లో ఆరబెట్టుకుంటున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల ఎక్కడ నష్టపోతామోనని రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నారు. పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఈ పాటికే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, ఇప్పుడు మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారోనని మండిపడుతున్నారు. గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించి.. ధాన్యాన్ని మాత్రం తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని మాధవనగర్, మోపాల్, కులాస్‌పూర్, బాడ్సి, తదితర గ్రామాల్లో ఇప్పటికే కొనుగోలు ప్రారంభించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతుల ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోకుండా చూడాలని రైతులు వాపోతున్నారు.

ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నాం..

: గంగాధర్, రైతు (మోపాల్)



అధికారులు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ తాము పండించిన ధాన్యాన్ని తీసుకోకపోవడంతో ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. క్వింటాలుకు 2300 చొప్పున అమ్ముకుంటున్నాం. అధికారులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తీసుకున్నట్లయితే తాము ప్రైవేటు వ్యక్తులకు అమ్మేవారిమి కాదు. వాతావరణ పరిస్థితుల వల్ల ఎక్కడ నష్టపోతామోనని తొందరగా అమ్ముకుంటున్నాం.



నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- కొనుగోళ్లపై కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సమీక్ష
- జిల్లాలో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

నిజామాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ధాన్యం నిల్వలు ఉన్న ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం మద్దతు ధరకు కొనడంతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోనస్‌ను కూడా అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఆలస్యమైనందున జిల్లాలో నిల్వలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి త్వరగా కొనుగోళ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అధికారులతో పలు దఫాలు సమీక్షించి మిల్లర్లతో చర్చలను జరిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యారంటీలను తీసుకొని కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మిల్లుల్లో ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు లేని వాటికి ముందస్తుగా కేటాయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం నిల్వలు పేరుకుపోవడం రైతుల నుంచి ఎక్కువ మొత్తంలో ఒత్తిళ్లు వస్తుండటంతో ధాన్యం కొనుగోలు కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారు. కొనుగోలుకు కావాల్సిన సామగ్రిని సమకూర్చడం, తరలించేందుకు వాహనాలతో పాటు హమాలీలను సిద్ధం చేస్తున్నారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులను మోహరించి కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

38 శాతం వరకు కోతలు పూర్తి

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. ధాన్యం సేకరించలేదు. రైతులు కేంద్రాలకు తీసుకువచ్చినా ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు. వర్షాలు, ఇతర కారణాలతో రైతులు ధాన్యాన్ని ఎక్కువ మొత్తంలో ప్రైవేటు వ్యాపారులకు అమ్మకాలు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 38 శాతం వరకు కోతలు పూర్తిచేసినట్లు అంచనా వేశారు. బోధన్ డివిజన్ పరిధిలో సుమారు రెండున్నర లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం వ్యాపారులు కొనుగోలు చేసినట్లు అంచనా వేస్తున్నారు. బోధన్ డివిజన్ పరిధిలోని రైతులు యథావిధిగా ఎప్పటిలాగానే వ్యాపారులకు అమ్మకాలు చేసినా ఇతర మండలాల్లోని రైతులు మాత్రం ధాన్యం నిల్వలను అలాగే ఉంచారు. రోడ్లు, పొలాల వద్ద నిలువ చేశారు. కొనుగోలు కేంద్రాలకు కూడా తీసుకువచ్చి ఆరబెట్టారు. కొనుగోలు చేపట్టకపోవడం వల్ల నిత్యం అధికారులను కలుస్తూ ధాన్యం కొనాలని ఒత్తిళ్లను పెంచారు. జిల్లా వ్యాప్తంగా వరి కోతలు మొదలు కావడం ఒత్తిళ్లు పెరగడం వల్ల పలు దఫాలు నివేదికలు కూడా ప్రభుత్వానికి పంపించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. క్యాబినెట్ సమావేశంలో కూడా చర్చించారు. పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లను చేపట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడం, పూర్తిస్థాయిలో నిబంధనలు విడుదల చేయనుండటంతో అధికారులు కూడా కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ, సంస్థ, వ్యవసాయ, సహకార శాఖ, రవాణా, పోలీసు, తూనికలు, కొలతల శాఖల అధికారులతో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు. వీరితో పాటు మిల్లర్లను కూడా ఆహ్వానించి చర్చలు జరిపారు. మంగళవారం నుంచి భారీ ఎత్తున కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో వరి కోతలు మొదలు పెట్టి నెల రోజులు దాటడం.. భారీగా ధాన్యం నిల్వలు పేరుకుపోవడం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తుండటంతో ఒకటి రెండు రోజుల్లో నిబంధనలు రావడం ఆలస్యమైనా కొనుగోళ్ల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

200లకు పైగా కేంద్రాల ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 200లకు పైగా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధాన్యం సేకరించకున్నా ఈ కేంద్రాలకు అవసరమైన యంత్రాలను, టార్పాలిన్‌లను, గన్నీ బ్యాగులను తరలించారు. మొదట రెండు మూడు రోజులు ఓ మోస్తరుగా ధాన్యం కొనడంతో పాటు దీపావళి తర్వాత పెద్ద ఎత్తున కొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కొనుగోళ్ల ఆలస్యం కావడం, రైతుల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నందున అన్ని కేంద్రాల్లో హమాలీలను అవసరం మేరకు ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనడంతో పాటు తరలించడంలో హమాలీలే కీలకం కావడంతో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 500 లారీలను ధాన్యం తరలించేందుకు

మిగతా 8వ పేజీలో...



బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల ర్యాలీ



కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమాండెంట్

రెండో రోజూ బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళన

- సస్పెండైన వారిని విధుల్లోకి తీసుకునే వరకూ ఆందోళనలు కొనసాగిస్తాం
- ఇన్‌చార్జి కమాండెంట్‌కు వినతి పత్రం అందజేసిన బెటాలియన్ కానిస్టేబుళ్లు

డిచ్‌పల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏడో బెటాలియన్‌లో కానిస్టేబుళ్లు తమ విధులను బహిష్కరించి రెండో రోజూ ఆందోళన కొనసాగించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని నిరసన తెలిపిన రాష్ట్రంలోని పలు బెటాలియన్ కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం సరికాదన్నారు. వారిని వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆదివారం బెటాలియన్‌లో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి కమాండెంట్ సురేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ పోలీసులు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య దేశంలో తమ హక్కులు, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరసన తెలిపిన బెటాలియన్ కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఎనిమిది గంటలు మాత్రమే పని చేయించాలని, చెత్తతీయడం, చెట్లు నరికించడం లాంటివి గాకుండా పోలీసు ఉద్యోగానికి మంచి గుర్తింపు ఉండేలా సర్వీస్ చేయించాలన్నారు. మట్టి పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. కర్నాటక, తమిళనాడు పద్ధతిలో రాష్ట్రంలో సైతం ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. సస్పెండైన 39 మంది కానిస్టేబుళ్లు, డిస్మిస్ అయిన 10మంది కానిస్టేబుళ్లను తిరిగి విధుల్లో చేర్చుకునే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కానిస్టేబుళ్లు నినాదాలు చేశారు.

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల మహా ధర్నా



అంబేద్కర్ చౌరస్తాలోధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి నాయకులు

8

పెరిగిన మాత్రల వినియోగం

- విపరీతంగా మింగుతున్న ప్రజలు
- దెబ్బతింటున్న ఆరోగ్యం
- ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

7



మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ బదిలీ

సీసీఎల్ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియామకం

నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా దిలీప్ కుమార్

సుభాష్ నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పని చేస్తున్న మంద మకరంద్ బదిలీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం 13 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న మంద మకరంద్‌ను సీసీఎల్ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో మేడ్చల్ జడ్పీ సీఈవో పనిచేస్తున్న దిలీప్ కుమార్‌ను నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన మకరంద్ గత కొన్ని నెలలుగా నగర మున్సిపల్ పరిధిలోని పలు విభాగాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పాలనను గాడిలో పడేవిధంగా చర్యలు చేపడుతుండగానే బదిలీ చర్చనీయాంశంగా మారింది.

నేడు బీసీ కమిషన్ బృందం రాక

- స్థానిక సంస్థల రిజర్వేషన్లపై కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషా పద్ధతిపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుల బృందం ఈనెల 29 మంగళవారం నిజామాబాద్‌కు రానుంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో తెలంగాణ బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ జరుపనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు తమ అభిప్రాయాలను తెలపవచ్చని కలెక్టర్ సూచించారు. నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు ఆరు సెట్లను తెలుగు లేదా ఇంగ్లిష్ భాషల్లో ఇవ్వాల్సి ఉంటుందని వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించవచ్చని తెలిపారు.

కుల సంఘాల నాయకులు బీసీ కమిషన్ కార్యక్రమానికి రావాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించనున్న బీసీ కమిషన్ కార్యక్రమానికి బీసీలంతా తమ సమస్యలు, డిమాండ్లతో రావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థితిగతులను రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ సంఘాలు సమస్యలను వినతిపత్రాల ద్వారా కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. బీసీ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్క బీసీ కులం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, గంగాకిషన్, దేవేందర్, కరిపె రవీందర్, కోయాడ శంకర్, శ్రీలత, రంగన్న పాల్గొన్నారు.

బీటీ రహదారికి నిధుల మంజూరుతో గ్రామస్థుల హర్షం

● వర్షాకాలం వచ్చిందంటే గ్రామస్థులకు నరకం ● అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలంటే నానా కష్టాలు పడాల్సిందే ● పట్టించుకోని అధికారులు



చింతల్‌వాడీ గ్రామానికి వేళ్లే రహదారి ఇదే..

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండలం నుండి చింతల్‌వాడీ గ్రామం మారుమూల ప్రాంతంలో ఉంది. గతంలో ఈ గ్రామం జుక్కల్ మండలంలో ఉండగా గత కొద్ది సంవత్సరాల కిందట ఈ గ్రామాన్ని పెద్ద కొడప్‌గల్ మండల పరిధిలోకి మర్చారు. కౌలాస్ నాలా ప్రాజెక్టుకు ఎగువ భాగంలో చింతల్‌వాడీ గ్రామం ఉంది. ఈగ్రామంలో సుమారు 3వందలకు పైగా జనాభా ఉండగా వారంతా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. బాబల్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలో ఈ గ్రామం ఉంటుంది. బాబల్‌గాం గ్రామానికి వెళ్లే బీటీ రహదారి నుంచి ఈ గ్రామానికి వెళ్లాలంటే సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రెండు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా మట్టితో కూడుకున్నది కావడంతో ప్రతి సంవత్సరం వర్షాకాలం వస్తే ఈ గ్రామానికి వెళ్లడం గగనమే. రెండు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి వానకాలంలో పూర్తిగా బురదతో నిండి ఉండటంతో అత్యవసర పనులు నిమిత్తం, ఆసుపత్రికి వెల్లాల్సినవారు ఈ రహదారిపై నానా కష్టాలు పడి ప్రయాణం సాగిస్తుంటారు. గత పాలకులకు ఈ రహదారిపై బీటీ నిర్మించాలని గ్రామస్థులు ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదు. ఇటీవల జుక్కల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తోట లక్ష్మీకాంతారావ్‌కు చింతల్‌వాడీ గ్రామస్థులు తమకు బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరడంతో అందుకు స్పందించిన ఎమ్మెల్యే బాబల్‌గాం జడ్పీ రహదారి నుంచి చింతల్‌వాడీ తండా వరకు సుమారు 2 కిలోమీటర్ల నిర్మాణానికి రూ2 కోట్ల 40 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఇటీవల ప్రభుత్వం జుక్కల్ నియోజక వర్గంలో 8 గ్రామాలలో బీటీ రహదారుల నిర్మాణానికి గాను 15 కోట్లరూపాయల నిధులు మంజూరు చేసింది. దీంట్లో చింతల్‌వాడీ గ్రామ రహదారి నిర్మాణానికి కూడ 2 రూ.కోట్ల 40 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వెళ్లడానికి సరియైన రహదారి లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నామని, తమ గ్రామానికి బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జుక్కల్ ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని తెలిపారు. గతంలో తాము బీటీ రహదారి నిర్మాణం చేపట్టాలని చాలా రోజులుగా ప్రజాప్రతినిధులకు విన్నవించిన తమ గోడు ఎవరూ వినలేదని, ప్రస్తుతం తమకు బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. సంబందిత అధికారులు టెండర్లు పూర్తి చేసి బీటీ రహదారి నిర్మాణం పనులు తొందరగా చేపట్టాలని కోరుతున్నారు.

బురద మయంగా మారిన రోడ్డు



మా గ్రామం నుండి బాబల్‌గాం ప్రధాన రహదారికి వెల్లాలంటే సుమారు 2 కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు ఉంటుంది.వానాకాలంలో ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉంటుంది, రహదారి బురదమయంగా ఉండి గుంతలు పడటంతో వానాకాలంలో మోటార్ సైకిళ్లపై ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా ఉంటుంది. వర్షం ఎక్కువగా కురిస్తే గ్రామానికి నడుచ ఎకుంటూ వెల్లాల్సిందే మరి.

- తుకరాం రెడ్డి గ్రామస్తులు చింతల్‌వాడీ

చీకటి పడిందంటే గ్రామానికి వెళ్లాలంటే భయం



వర్షకాలంలో చింతల్‌వాడీ గ్రామంలో ఏదైనా అనారోగ్యం చేస్తే ఆసుపత్రికి వెళ్లాలంటే చుక్కలు కనడబడుతాయి. రహ దారిపై గుంతలు పడటంతో అంబులెన్స్ రాక గర్భిణులు ముందే సురక్షిత గ్రామాలకు వెళ్తారు. అంతేగాక పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లిన సమయంలో చీకటి పడితే గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. గ్రామస్థుల కోరిక మేరకు బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు రుణ పడి ఉంటాం.

- దశరథ్ యువకుడు చింతల్‌వాడీ గ్రామం

క్రీడలతో మానసిక ఉల్లాసం : రూరల్‌సీఐ


క్రీడాకారులకు పరిచయం చేసుకుంటున్న ఆర్మూర్‌రూరల్ సీఐ

మెండోర, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మెండోర మండల కేంద్రంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మాకూరి వినోద్, గుంటి రవి స్మారక కబడ్డీ, వాలీబాల్, ఓపెన్ టోర్నమెంట్ పోటీలను ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని క్రీడలు స్ఫూర్తిని రగిలించి జీవితాన్ని ఆనందమయం చేస్తాయని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడల్లో రాణించి జాతీయస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సావెల్ సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, మిట్టపల్లి రాజేశ్వర్, నోముల సాయిరెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు శ్యామ్; అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మోకన్‌పల్లికి చెందిన టేకు ముత్తెమ్మ అనే 85సంవత్సరాల వృద్ధురాలు అదృశ్యమైందని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. ఆమెకు గత కొంతకాలంగా మతిస్థిమితం లేదని ఈ నెల 26న ఉదయం బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. కుమారుడు గంగారాం ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి), మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో గుర్తుతెలియని దొంగలు ఏటీఎంలో డబ్బులు దొంగిలించేందుకు యత్నించారు. ఆదివారం అర్ధరాత్రి చౌరస్తాలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన ఏటీఎంలోని కేబుల్ వైర్‌ను కట్ చేశారని బ్యాంక్ మేనేజర్ సత్య నారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

మెండోర, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి), మండలంలో బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రిజిష్టర్‌ను, రికార్డులను అదే విధంగా విద్యార్థుల సామర్ధ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు మండల విద్యాధికారిణి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శమంత, ఉపాధ్యాయులు ఓరమేష్, కవిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

డొంకేశ్వర్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి), డొంకేశ్వర్ మండలంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌కుమార్‌రెడ్డి పరారమ్మించారు. సోమవారం డొంకేశ్వర్ మండలం చిన్నాయానం, అన్నారం, సిర్పూర్, గాదేపల్లి, నడ్కుడ గ్రామాల్లో ఆయన పలు కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల భూమేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భరత్‌రెడ్డి, మహిపాల్, గణేష్‌గౌడ్, బోజారెడ్డి, దేగాం గంగారెడ్డి, శ్యామ్‌గౌడ్, నాగరాజ్, ఎర్రం లింగం, తదితరులు పాల్గొన్నారు.

పొతంగల్‌లో ఎంఈవోకు సన్మానం

కోటగిరి,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల విద్యాధికారి లోల శంకర్‌ను సోమవారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పొతంగల్ మండలం ఏర్పాటైన రెండేళ్లకు పూర్తిస్థాయి ఎంఈవోను నియమించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పొతంగల్ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయిలు, రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్, రిటైర్డ్ ఈవో గంగాధర్, మాజీ సర్పంచ్ శంకర్, పీరయ్య పాల్గొన్నారు.

పోషణ లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : సీడీపీవో


మాట్లాడుతున్న సీడీపీవో స్వర్ణలత

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఆరు మాసాల నుండి 5సంవత్సరాల లోపు గల చిన్నారులలో పోషణ లోపం ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీవో స్వర్ణలత కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ టీచర్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులలో తీవ్ర లోప పోషణ తప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళ శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. నవజాత శిశుల సంరక్షణతో పాటు ఆరు మాసాల నుండి 5సంవత్సరాల లోపు గల చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రాధాలక్ష్మి, భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప తదితరులున్నారు.

జాతీయ సమైక్యత కోసమే ఏక్ భారత్ శ్రేష్ట భారత్

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి


చాయచిత్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమైక్యత స్ఫూర్తిని ప్రోత్సహించడమే ఏక్‌భారత్ శ్రేష్ఠభారత్ లక్ష్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌పై చాయచిత్ర ప్రదర్శనను ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేష్ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ పై చాయ చిత్ర ప్రదర్శన నిర్వహించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు, యువతలో దేశభక్తి స్వాతంత్ర ఉద్యమం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తుందన్నారు.కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరోఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటి ఆఫీసర్ ధర్మనాయక్, డిగ్రి కళాశాల ప్రిన్సిపాల్ వై. వేణు ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునిత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయనాథ్‌రెడ్డి, టీఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నహిదఫిర్దౌస్, రవీంధర్‌రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎంఆర్‌ఈఐఎస్ ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి


ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):పీఎంఆర్‌ఈఐఎస్‌లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఆమేర్ అలీ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. బోధన్‌కు ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్సీ అమేర్ అలీ ఖాన్‌కు తెలంగాణ ప్రభుత్వం మైనారిటీలకై ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అందులో భాగంగా మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థుల కోసం వినూత్న రీతిలో ఎన్నో పథకాలు ఇంటర్ తర్వాత ఎంసెట్, నీట్‌లో ర్యాంకు సాధించడానికి కావాల్సిన పుస్తకాలు, ఫ్యాకల్టీ, మౌలిక వసతులు కల్పించి వారి అభివృద్ధికై ఎంతో కృషి చేస్తుందన్నారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో స్టేట్ అడ్వయిజర్ కౌన్సిల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్ బషీర్, జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ అమేద్, ఉపాధ్యక్షులు మహ్మద్ షఫీ, జమీల్ అహ్మద్ ఖాన్, మహ్మద్ మాజీద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి

ముప్కాల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బాల్కొండ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి అమ్ముకోవాలని, ఎట్టి పరిస్థి తుల్లో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులందరు 17 శాతం తేమతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి విండో పరిదిలోని కంచర్ల గ్రామంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ వైస్‌చైర్మన్ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్‌చైర్మన్ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో విండో సీఈవో మోహన్‌గౌడ్, విండో డైరెక్టర్లు, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని నవీపేట, బినోల సొసైటీల ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన "ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరిగేనా?"అనే వార్తకు అధికారులు స్పందించారు. నవీపేటలో సొసైటీ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా బినోల సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని జన్నేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభమెప్పుడు..?

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వరి కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారని రైతులు అయోమయానికి గురవుతున్నారు. సొసైటీ ఆధ్వర్యంలో పోచమ్మగల్లీ, దోబిఘాట్ వద్ద, అలాగే మెప్మా ఆధ్వర్యంలో పిప్రి రోడ్డు డిగ్రీ కళాశాల, పెర్కిట్‌లోని వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేవారు. రైతులు వరి కోతలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఎప్పుడు అకాల వర్షంతో నష్టపోతామేనని భయంతో దళారులను ఆశ్రయించి సన్నరకం వడ్లకు రూ.2200నుంచి రూ.2600వరకు అమ్మేస్తున్నారు. దళారులకు అమ్మడంతో రాష్ట్ర ప్రభుత్వం సన్నరకానికి ఇస్తానని రూ.500 బోనస్ నష్టపో తామనే భయంతో మరికొందరు ఆరబెటిన కల్లాలలో అలాగే ఉంచారు. కష్టపడ్డ పంటకు ఇటు అకాల వర్షాలు భయపెడుతున్నా యన్నారు. అటు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ రైతుల మదిలో మెదిలి అయోమయానికి గురవుతున్నారు. తక్షణమే వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ


జన్నేపల్లిలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

నవీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి, నవీపేటలలో సోమవారం ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్‌హుస్సేన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. స్టాక్ బోర్డులపై ప్రతిరోజు ఎరువుల వివరాలు నమోదు చేయాలని, రైతులకు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రసీదు తప్పకుండా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో నవీన్ కుమార్, తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

డొంకేశ్వర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ తహసీల్దార్‌గా ఎం.నరేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గత 40రోజులుగా బాధ్యతలు చేపట్టిన షైమద్‌హుస్సైన్ నిజామాబాద్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్ళారు. నూతన తహసీల్దార్ సిబ్బంది శాలువతో సన్మానించారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

నవీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్‌కు చెందిన సుంకరి చాయ అనే 30సంవత్సరాల వివాహిత మహిళతో పాటు 11 సంవత్సరాల రాఘవి అనే కూతురు, రితిక్ అనే 7సంవత్సరాల కుమారుడు అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మిట్టాపూర్‌కు చెందిన రాజేందర్‌తో చాయకు 12సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నాడని అన్నారు. పెద్దకూతురు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుండగా చిన్నకూతురు రాఘవి, కుమారుడు రితిక్‌లు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారన్నారు. ఈ నెల 27న చాయతో పాటు కుమార్తె రాఘవి, కుమారుడు రితిక్‌లు అదృశ్యమయ్యారన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై తనకు అనుమానం ఉందని భర్త రాజేందర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమాలపై అవగాహన అవసరం

సదాశివనగర్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):సామాజిక మాధ్యమాల వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకుని ముందుకు సాగాలని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అమృతరాజేందర్‌రావు అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో సదాశివనగర్ మండల మహిళ సమాఖ్య సమావేశంలో పాల్గొని మానవ అక్రమరవాణా, సామాజిక మాధ్యమల వల్ల ఎదురవుతున్న సమస్యలు, మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, బాల్యవివాహలు, మానసిక ఆరోగ్యం అంశాలపై సమావేశంలో పాల్గొని అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల నుంచి ఓటీపీలు చెప్పడం గాని లింక్‌లు గాని ఓపెన్ చేయడం చేయకూడదని అలా చేయడం వల్ల మన బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న నగదు తస్కరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఏపీడీ మురళికృష్ణ, డీపీఎం సుధాకర్, రవీందర్‌రావు, వకుళ, ఏపీఎం రాజారెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, సంస్థ ప్రతినిధులు విఠల్‌రావు, వివిధ గ్రామాల అధ్యక్షులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిగా నీలా సొసైటీలో సస్పెండ్..

రెంజల్ సొసైటీలో క్లర్క్‌గా విధులు


సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఆర్డర్

రెంజల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఆయన ఓ అవినీతి అధికారిగా ముద్ర పడడంతో విధుల నుండి పక్కన బెట్టారు. కాని ఆయనకు అధికారుల అండదండలు ఉండడంతో మరోచోట క్లర్క్‌గా తీసుకోవడంతో దర్జాగా విధులు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లగా ఈ సంవత్సరం జనవరి 10వ తేదిన రెంజల్ మండలం నీలా సొసైటీ కార్యదర్శి ఇంతియాజ్ అక్రమార్కులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో జిల్లా కోఆపరేటివ్ అధికారులు విచారణ చేపట్టారు. అప్పటి నుండి ఆయనను కార్యదర్శి విధుల నుండి తప్పించారు. అయిన కూడా అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో రెంజల్ సొసైటీలో క్లర్క్‌గా నియమించారు. అవినీతికి పాల్పడినట్లు రుజువు కావడంతో జిల్లా కోఆపరేటివ్ అధికారి ఈ నెల 17న సస్పెండ్ చేశారు. సస్పెండ్ లేటర్‌ను పక్కన పెట్టి రెంజల్ సొసైటీలో ఇంతియాజ్‌ను క్లర్క్‌గా తీసుకోవడం పట్ల పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక మారు రైతుల సొమ్మును కాజేసి అవినీతి అధికారిగా ముద్రపడిన అధికారిని మరోచోట క్లర్‌గా విధుల్లోకి తీసుకోవడం ఏమిటని రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆలూర్‌లో బౌద్ధ దీపావళి ఘనంగా నిర్వహించాలి


ఆలూర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు

పెర్కిట్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు జ్ఞాన అన్వేషణ కపిల వస్తున్న కార్తిక పౌర్ణమి రోజు ప్రజలు దీపాలు వెలిగించి బుద్ధుడిని స్వాగతించిన రోజే ఘనంగా బౌద్ధ దీపావళి జరుపుకోవాలని డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇత్వార్‌పేట్ లింగన్న అన్నారు. సోమవారం ఆర్మూర్ మండల కేంద్రంలో బుద్ధ విహార నిర్మాణ పనులను పరిశీలనకు జిల్లా నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధర్థ గౌతముడు రైతు జాతి ముద్దుబిడ్డ అని గౌతముని జ్ఞానప్రప్తితో తిరిగి వస్తున్న శుభవేళ ఊరిలో తొలివిడత పంటలు కోతకు వస్తున్న శుభసందర్భంలో బుద్ధిస్ట్ పండగను జరుపుకోవడం సాంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ ఎస్టీ, బీసీ ప్రజలందరు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి


అంగన్‌వాడీ ఆయమ్మను సన్మానిస్తున్న దృశ్యం

రెంజల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలోని బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి అన్నారు. సోమవారం మండలంలోని కిసాన్ తండాలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో తప్పనిసరిగా న్యూట్రిషన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి, ప్రతి నెల 5వ తేదిన పిల్లల బరువు చూడాలన్నారు. ప్రతి చిన్నారికి బరువులను గుర్తించి తక్కువ బరువు ఉన్న పిల్లలకు పౌష్టికాహారం కోసం న్యూట్రిషన్ సెంటర్ ఏర్పాటు చేసి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఇటీవల దూపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయమ్మగా విధులు నిర్వహిస్తున్న గంగామణి పదవి విరమణ పొందడంతో సోమవారం ఆమెకు శాలువ, పూలమాలలతో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి, సూపరిండెంట్ శ్రీనివాస్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఏర్గట్ల, అక్టోబరు 28 (ఆంధ్ర్యజ్యోతి) : మండల కేంద్రంలోని అయప్పస్వామి దేవాలయానికి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు వ్యక్తి మృతిచెందాడు. స్థానిక ఏఎస్సై లక్ష్మన్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం స్విఫ్ట్ కారు టీవీఎస్ చాంప్ వాహనాలు రెండు ఎదురెదురుగా ఢీకొనడంతో ఏర్గట్ల గ్రామానికి చెందిన గాండ్ల నాగయ్య(45) అక్కడిక్కడే మృతి చెంద గా భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతుదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

డొంకేశ్వర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే తమ సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డొంకేశ్వర్ తహసీల్దార్‌కు వినతి అందజేశారు. ధర్మబద్ధంగా ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక చెల్లింపులను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మండల తాపస్ అధ్యక్షుడు సుదర్శన్ ఉన్నారు.

ముప్కాల్ : కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే తమ సమస్యలను పరిష్కరించాలని ముప్కాల్ మండల అధ్య క్షుడు సుంకరి రవికుమార్ డిమాండ్ చేశారు. తపస్ ముప్కాల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల తపస్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధానకార్యదర్శి కనకాద్రి, జిల్లా బాధ్యులు కోటగిరి రమేష్, సభ్యులు ఓంప్రకాష్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి : పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్మర్‌పల్లి మండల (తపస్) తెలంగాణ ప్రాతీయ ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ ఆంజనేయులకు వినతిపత్రాన్ని అందజేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో టీయూపీఎస్ డివిజన్ కార్యదర్శి శంకర్ గౌడ్, మండల అధ్య క్షుడు సల్లూరి కిషన్ గౌడ్, గుండోజి రవిందర్, మాసం శ్రీనివాస్ గౌడ్, గుజ్జేటి రవిందర్, రవి కిషన్‌పాల్గొన్నారు.

మోస్రా: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో మండల తపస్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన నాలుగు డీఏలు పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని మండల తహసీల్దార్ మారుతిని కలిసి పూర్తి వివరాలు తెలియపరచి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తపస్ మండల అధ్యక్షుడు గాండ్ల మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధాన్యం రాశులు ఎక్కడికక్కడే..

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా ధాన్యం కొనుగోలు చేయడం లేదంటున్న రైతులు
- మోపాల్, సిరికొండలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ధాన్యం రాశులు
- వర్షభయంతో రైస్‌మిల్లులు, దళారులకు అమ్ముకుంటున్న రైతులు
- మద్దతు ధర రావడం లేదని రైతుల ఆవేదన
- అధికారులు స్పందించాలంటున్న అన్నదాతలు

మోపాల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేసి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులు మాత్రం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు, రైస్‌మిల్లకు అమ్ముకుంటున్నారు. పంటను కోసి రోడ్లపైనా, పొలాల్లో ఆరబెట్టుకుంటున్నామని, వాతావరణ పరిస్థితుల వల్ల ఎక్కడ నష్టపోతామోనని రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నామని చెప్తున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం చేయడం వల్లే పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఈపాటికే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని ఇప్పుడు మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారోనని మండిపడుతున్నారు. గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభం చేశారు. చేసి రోజులు గడుస్తున్నా రైతుల ధాన్యాన్ని మాత్రం తీసుకోవడం లేదని వాపోతున్నారు. పాలకులు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకొని మోసపోవద్దని చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మాధవనగర్, మోపాల్, కులాస్‌పూర్, బాడ్సి గ్రామాల్లో ఇప్పటికే కొనుగోలు ప్రారంభించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోకుండా చూడాలని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు ప్రైవేటు వ్యక్తులకు పండించిన ధాన్యాన్ని అమ్మేసేకున్నారు.

కేంద్రాలను ప్రారంభించి.. కొనుగోళ్లు మరిచి..

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యేలు, ఐడీసీఎంఎస్ అధ్యక్షులు ఆగమేఘాలపై ప్రారంభించి ఎనిమిది రోజులు కావస్తున్న ధాన్యాన్ని మాత్రం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సిరికొండ మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు వానకాలం పంటను కోస్తున్నారు. ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోస్తున్నారు. తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయని భావించిన రైతులు వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పీఏసీఎస్, ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఐడీసీఎంఎస్ అధ్యక్షులు తారచంద్‌నాయక్ ఆగమేఘాలపై గ్రామాల్లో ప్రారంభించి వారం రోజులు గడిచింది. కళ్లాల్లో ధాన్యం ఎండిపోతుందని, బరువు తగ్గిపోతుందని రైతులు చెపుతున్నారు. కేంద్రాలను ప్రారంభించి వారం గడుస్తున్నా నేటికీ రైస్‌మిల్లుల అలాట్‌మెంట్ చేయకపోవడం వల్ల రైతుల్లో ఆందోళన మొదలైంది. గోనే సంచులను కేంద్రాలకు చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం రైతుల్ని బాధిస్తోంది. ప్రభుత్వం ఏ గ్రేడు క్వింటా ధాన్యానికి రూ.2320 చెల్లిస్తుండగా.. వ్యాపారులు క్వింటా ధాన్యం రూ.2200 మాత్రమే చెల్లిస్తున్నట్లు రైతులు చెప్తున్నారు. రైతులు ధాన్యం బరువు తగ్గుతుందని, వర్షాలు కురిస్తే తడిసిపోతుందనే భయంతో వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. సన్నరకం క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లింస్తుందని ప్రకటించిన నేపథ్యంలో రైతులు సన్నరకం ధాన్యాన్ని అమ్ముకోకుండా ఆరబెట్టి కుప్పలు పోసి తూకం వేయడానికి సిద్ధంగా ఉంచుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయడం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మరింత ఆలస్యం చేస్తే దొడ్డు రకం ధాన్యాన్ని వ్యాపారులకు అమ్ముకోవడానికి సిద్ధపడుతారని కొంతమంది రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే రైతుల్లో కొంత అసంతృప్తి మొదలవుతోంది. వానాకాలం పంట కోయడం పూర్తి కావస్తున్నా నేటికీ రైతు భరోసా డబ్బులు వేయకపోవడంతో పాటు రూ.రెండు లక్షల రుణమాఫీ కాకపోవడం వల్ల రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది. ప్రభుత్వం పట్ల కొంత మేరకు వ్యతిరేకత ఎదురవుతోంది. ధాన్యం కొనుగోలు చేయడం ప్రారంభించకపోతే అగ్నికి ఆజ్యం పోసినట్లు అవుతుందని మరికొందరు రైతులు చెప్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైస్‌మిల్లుల అలాట్‌మెంట్ చేసి ధాన్యాన్ని కొనుగోళ్ల ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నాం..

● రైతు, గంగాధర్



గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. వాతావరణ పరిస్థితుల బాగోలేవు. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి. దీంతో గత్యంతరం లేక ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సి వస్తోంది. క్వింటాకు రూ.2300 వరకూ చెల్లిస్తున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రారంభిస్తే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునే పరిస్థితి వచ్చేది కాదు. వాతావరణ పరిస్థితులతో నష్టపోతామోనని భయానికి అమ్ముకుంటున్నాం.



కమ్మర్‌పల్లి శివారులోని జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

ఆంధ్రజ్యోతి పరిశీలన



సూచిక బోర్డు కనిపించని నాగాపూర్ రహదారి



గ్రామశివారులో రహదారిపై ధ్వంసమైన కల్వర్టు



కమ్మర్‌పల్లి రహదారిపై రక్షణ గోడ లేకుండా ఉన్న కల్వర్టు

కమ్మర్‌పల్లి జాతీయరహదారిపై ప్రమాదఘంటికలు!

» ప్రమాదకరంగా మలుపులు, కూలిన కల్వర్టులు » తరుచూ ప్రమాదాలు » పట్టించుకునేవారే కరువు

కమ్మర్‌పల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్రం మీదుగా సాగుతున్న జాతీయ రహదారి 63పై ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఈ రహదారిపై అనేక ఓ వైపు ప్రమాదకర మలుపులు, మరోవైపు కూలిన కల్వర్టులు దర్శనమిస్తున్నాయి. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాల చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారిపై ఈ దుస్థితి నెలకొని ఉన్నా ఎవరికీ పట్టింపు లేకుండా పోతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కమ్మర్‌పల్లి మండల ప్రారంభం నుంచి జిల్లా సరిహద్దు గండిహనుమాన్ వరకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరం వరకు జాతీయరహదారి 63 వస్తోంది. అయితే ఈ రహదారి మధ్యలో ఐదు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. కానీ ఎక్కడ కూడా సూచిక బోర్డులు లేవు. కాగా ఈ రహదారి పక్క నుంచే తిమ్మాపూర్, నాగాపూర్ గ్రామాలకు వెళ్లేందుకు రహదారులు ఉన్నా కనీసం గ్రామాలకు సంబంధించిన సూచిక బోర్డులు కనిపించవు. దగ్గరి వరకు వస్తే తప్ప ఈరహదాలరులున్నట్లు కనిపించవు. ఇదిలాఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సుమారు 90డిగ్రీల మలుపు ఉంది. మలుపు ప్రారంభం నుంచి పోలీస్‌స్టేషన్ దాటే వరకు రెండు పెట్రోల్ బంక్‌లు తిమ్మాపూర్ రహదారి వస్తోంది. కమ్మర్‌పల్లి మండలకేంద్రం శివారులో నాగాపూర్ గ్రామ రహదారి వస్తుంది. కానీ ఎక్కడ కూడా మలుపులు ఉన్నట్లు, గ్రామ రహదారులు ఉన్నట్లు సూచికలు ఏర్పాటు చేయలేదు. ఇదిలాఉంటే ఆరు కిలోమీటర్ల దూరంలో జాతీయరహదారిపై ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని కల్వర్టులైతే ధ్వంసం కాగా, మరికొన్ని కల్వర్టులు రహదారికి సమానమై ఉన్నాయి. కొన్ని కల్వర్టుల వద్ద కనీస రక్షణ గోడలు కానీ, సూచిక బోర్డులు కానీ లేవు. వాహనదారులు ఆదమరిస్తే అంతేసంగతులు. కల్వర్టు తెలియక అందులోకి వాహనాలు దూసుకుపోయి ప్రమాదాలకు దారితీసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. జాతీయరహదారి వెట ఉన్న మొక్కలు ఏపుగా పెరిగినా కొమ్మలు తొలగించకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు లేకపోలేదు. పత్రికల్లో ప్రమాదవార్తలు చూస్తున్న సంబంధిత శాఖ అధికారుల్లో చలనం లేకపోవడం పట్ల వాహనాదారులు, స్థానికుల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు జాతీయరహదారిపై, కల్వర్టులకు మరమ్మతులు, ప్రమాద మలుపులు, గ్రామాల రహదారుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనాదారులు వేడుకుంటున్నారు.

ఇంటర్వ్యూ

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

● టపాసుల దుకాణాల లైసెన్స్‌దారులు జాగ్రత్తలు పాటించాలి

● ఎల్లారెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య



ఎల్లారెడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాల లైసెన్స్‌దారులు నిబంధనలు పాటించకపోతే ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే లైసెన్స్ రద్దు చేస్తామని, అదే విధంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై వివరాలు వెల్లడించారు.

● ఆంధ్రజ్యోతి: టపాకాయల దుకాణదారులు ఎలాంటి నిబంధనలు పాటించాలి?

అధికారి: టపాసుల దుకాణాలను జనవాసాలు లేని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకోవాలి. వారికి ఈ లైసెన్స్‌లు తాత్కాలికంగా జారీ చేస్తాం. ఎల్లారెడ్డిలో నవంబర్ 2వ తేదీ వరకు దుకాణాలను నిర్వహించేలా లైసెన్స్‌లు జారీ చేశాం.

● ఆంధ్రజ్యోతి: నిబంధనలు పాటించకపోతే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

అధికారి: ఎల్లారెడ్డిలో ప్రతీ సంవత్సరం ఏర్పాటు చేసుకుంటున్న ప్రాంతంలోని దుకాణాలు ఏర్పాటు చేసేందుకు లైసెన్స్‌లు జారీ చేశాం. 50మీటర్ల నిబంధనల అంశంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రతి దుకాణంలో వంద కిలోల మేరకు మాత్రమే నిబంధన పాటించాలి. ఈ అంశంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

● ఆంధ్రజ్యోతి: దుకాణాల ఏర్పాటుకు ఏయే నిబంధనలు పాటించాలి?

అధికారి: రేకుల షెడ్డులతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. ఒక్కో దుకాణానికి మూడు మీటర్ల దూరం పాటించాలి. 200 లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ బ్యారళ్లను ఆరు బకెట్లను ఏర్పాటు చేసుకోవాలి. వీటిలో మూడు బకెట్లను ఇసుకతో, మరో మూడు బకెట్లను నీళ్లతో ఉన్నవి ఏర్పాటు చేసుకోవాలి.

● ఆంధ్రజ్యోతి: అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అధికారి: అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాల్సిందే. ఆయిల్ బర్నింగ్ ల్యాంప్స్, గ్యాస్ ల్యాంప్స్ తదితరన వాటిని విద్యుత్ కోసం ఏర్పాటు చేసుకోరాదు. అలాగే బీడీ, సిగరేట్ తాగడం పూర్తిగా నిషేధించాలి. విద్యుత్ దీపాల కోసం ఏర్పాటు చేసుకున్న ఎలక్ట్రికల్ వైర్లు ఏర్పాట్ల అంశంపై పూర్తి జాగ్రత్తలు చేపట్టాలి.

ఆంధ్రజ్యోతి పరిశీలన



డొంకేశ్వర్ పీహెచ్‌సీలో వ్యాధులపై రికార్డులో నమోదు చేస్తున్న సిబ్బంది

షుగర్, బీపీ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

పెరిగిన మాత్రల వినియోగం

● చిన్న సమస్యలకూ మాత్రలు మింగుతున్న ప్రజలు ● అధికమవుతున్న బీపీ, మధుమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు

డొంకేశ్వర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో ప్రజలు ఎటువంటి రోగాలు వచ్చినా మందులు మింగకుండానే రోగాలను తగ్గించుకునేవారు. తీవ్రమైన జలుబు వస్తే వంటింటి చిట్కాలు వంటి నయమాలు పాటిస్తూ వాటిని నయం చేసుకునేవారు. అత్యవసరమైన పరిస్థితులు వస్తే తప్ప మందులు గోలిలు వాడకం ఉండేది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహారాన్ని ఔషధంగా తీసుకొని స్థాయి నుంచి ఔషధాలే ఆహారంగా తీసుకునేలా తయారయ్యారు. నిద్ర లేచినప్పటి నుంచి నిద్రపోయే వరకు బీపీ, మధుమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధులు మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకప్పుడు షుగర్ వ్యాధి అనేది 50 ఏళ్ల పైబడిన వాళ్ళకు మాత్రమే వచ్చే అవకాశాలు ఉండేవి. కానీ నేడు అప్పుడే పుట్టిన పిల్లలు సైతం డయాబెటిక్ వ్యాధి బారిన పడుతుండడం ఆందోళన కలిగించే అంశం. జీవనశైలిలో మార్పులు మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవడం చెడు అలవాట్లకు బానిస కావడంతో వ్యాధులు కభళిస్తున్నాయి. ఆరోగ్య సూత్రం మీద అవగాహన లేని కారణంగా విచ్చలవిడిగా మాత్రలు మింగేస్తున్నారు. ప్రజలు ఉదయం బోజనం కంటే ముందే మందులు తీసుకోవాల్సి వస్తోంది. ఈ రకమైన మందులు వాడి వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది.

ఆరోగ్య సూత్రాలు పాటించేవారు కరువు..

డొంకేశ్వర్ మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు సబ్‌సెంటర్లు ఉండగా.. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో రోజుకు 60 నుంచి 70 మందికి పైగా ఓపీలు వస్తుంటాయి. దీనికితోడు జిల్లాకేంద్రంతోపాటు ఇతర జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులలో బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులు చికిత్సలకు ఓపీకి వెళ్తుంటారు. ఇందులో అధికంగా థైరాయిడ్, బీపీ, మధుమేహం, అస్తమా వారే అధికంగా ఉంటారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రి మాత్రలు వాడేవారు బీపీ 346, షుగర్ 206, బీపీ, షుగర్ కలిపి వాడుతున్నవారు 172, ప్రైవేటు ఆసుపత్రి బీపీ మాత్రలు వాడుతున్న వారు 743, ప్రైవేటు ఆసుపత్రి షుగర్ వాడుతున్నవారు 276, షుగర్ బీపీ కలిపి ఉండి ప్రైవేటు ఆసుపత్రి మాత్రలు వాడుతున్న 216 మంది వాడుతున్నట్లు తెలిసింది. సుమారు 200 మంది పైగానే చికిత్సలు నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నట్లు సమాచారం. మనిషి నిత్యజీవితంలో ఆరోగ్య సూత్రాలు పాటించకపోతే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రతీరోజు వ్యాయామం కాలినడక వంటివి చేసినట్లయితే దీర్ఘకాలం వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని చెప్తున్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

● విద్యాసాగర్, వైద్యులు, డొంకేశ్వర్



గతంలో షుగర్, బీపీ ఉన్న వారికి మూడు గదులు గల బ్యాగును అందించాం. నెలకు సరిపడా మందులను సిబ్బంది ఇంటికి వెళ్లి ఇచ్చివస్తారు. అందరికీ ఆరోగ్య సూత్రాలు తెలుసు కానీ పాటించే వారు కనీసం 2 శాతం మంది కూడా లేరు. చిన్న జాగ్రత్తతో ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నా రు. ఆరోగ్య నియమాలు పాటించకపోవడంతో జబ్బులను కొని తెచ్చుకోవాల్సిన దుస్థితి వస్తోంది. కచ్చితంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలి. బయట ఆహారాన్ని అలవాటు పడకూడదు. డాక్టర్ సలహాలు, సూచనలు లేకుండా మాత్రలు వాడొద్దు.

రోజూ మాత్రలు వేసుకుంటా

● చిన్నక్క, నడ్కుడ



బీపీ, షుగర్ మాత్రలు ప్రతీరోజు వాడుతుంటా. నెలకు సరిపడా మందులను ప్రభుత్వ ఆసు పత్రి నుంచి అందిస్తారు. గోలిలు వేసుకుంటేనే ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. ప్రతీరోజు కొద్దిసేపు వాకింగ్ చేస్తున్నాను.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

(ఐదో పేజీ తరువాయి)

అందుబాటులో ఉంచారు. ఈదఫా మిల్లర్లకు గ్యారంటీ తీసుకొని ధాన్యాన్ని కేటాయించనున్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా గత కొన్నేళ్లుగా ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా కస్టం మిల్లింగ్ అందించే మిల్లులకు ముందుగా ధాన్యాన్ని కేటాయించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బ్యాంకు గ్యారంటీలను తీసుకొని వెంటనే ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణ రకాన్ని క్వింటాలుకు 2300 రూపాయలు, ఏగ్రేడ్ రకానికి 2320 రూపాయలకు కొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే సన్నరకాలు, దొడ్డురకాలను వేరువేరుగా కొననున్నారు. కొన్న తర్వాత తరలింపులోనే బస్తాలపైన మార్క్ చేసి సన్నాలు, దొడ్డు రకాలు వేరువేరుగా తరలించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు కొన్న ధాన్యాన్ని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా శిక్షణ కూడా అందించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను మంగళవారం నుంచి చేపట్టనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా కొనుగోళ్లను మొదలు పెడతామని తెలిపారు. నిబంధనల మేరకు ధాన్యం కొనడంతో పాటు రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ధాన్యం కొనడం, వెంటనే మిల్లులకు తరలించే విధంగా ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో అన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని సేకరిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

సిరికొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని ఐకేపీ ఏపీడీ రవీందర్ రైతులను కోరారు. మండలంలో ఐకేపీ నిర్వహించే కేంద్రాలను సిరికొండ, పోతున్నూర్, వాల్గోట్, గడ్కోల్, మెట్టుమర్రి తండా, కొండపూర్, తూంపల్లి, వర్నున్ తండాల్లో కొనుగోలు కేంద్రాలను సోమవారం ఏపీడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నందున ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి, డీపీఎం సాయిలు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రన్న, ఏపీఎం కిరణ్‌కుమార్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలి

సిరికొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బాకారం గంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీందర్ రావుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, రమేష్, నడిపన్న, సంతోష్, శ్యామ్‌రెడ్డి, ఊషన్న తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నగరంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను ఇవ్వాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు కొట్టాల రవీందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ వైస్ చైర్మన్‌గా నల్లా చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నిక



డీసీసీ వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నిజామాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వైస్ చైర్మన్‌గా నల్లా చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. బ్యాంకు ఆవరణలో సోమవారం వైస్‌చైర్మన్ కోసం ఎన్నిక నిర్వహించారు. బ్యాంకు పరిధిలోని మొత్తం డైరెక్టర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. నిర్ణయించిన మేరకు వైస్‌చైర్మన్‌గా ఒకే ఒక్క దరఖాస్తు రావడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పారదర్శకంగా చేపపిల్లల పంపిణీ

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా చేపపిల్లల పంపిణీ చేస్తుందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేపపిల్లల పంపిణీ సక్రమంగా జరగడం లేదని ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా కాంగ్రెస్ ఫిషర్‌మెన్సరీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాణ్యమైన సీడ్ అందడం లేదని సగమే అందుతుందని గంగపుత్రుల మనోభావాలను దెబ్బతీసేలా మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అబద్ధపు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో అర్సపల్లిలోని గంగపుత్రుల భూమి అన్యాక్రాంతానికి గురైందని దానిపై హైకోర్టు నుంచి స్టే తీసుకొచ్చామన్నారు.

వినియోగదారుల పోస్టర్ ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ అథారిటీకి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా పౌరసరఫరాల అధికారి అర్వింద్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు.

నగరంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ సహాయనిధి కింద 145 మంది లబ్ధిదారులకు నగర ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ చెక్కులను అందజేశారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా 145 మందికి సుమారు 41లక్షల 75వేల 500 రూపాయల చెక్కులను అందించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఎక్కువ మొత్తంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అర్బన్ నియోజకవర్గానికే రావడం జరిగిందన్నారు. ఎటువంటి జాప్యం లేకుండా క్యాంప్ కార్యాలయం నుండి సెక్రెటరియేట్‌కు పంపుతున్నట్లు తెలిపారు. చెక్కుల జారీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందని దీంతో బాధితులకు చికిత్స ఖర్చు ఆర్థిక భారంగా మారుతుందని అన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల జాప్యంపై దరఖాస్తు చేసుకున్న మొత్తంలో 50 శాతం చెల్లించాలని డిమాండ్ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల మహా ధర్నా

బోధన్‌రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశింధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 7800 వేల కోట్ల స్కాలర్‌షిప్స్ ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితాలకు కాకుండా విద్యార్థుల పక్షాన ఉండి విద్యార్థులకు సంబంధించిన బకాయిలను విడుదల చేయాలన్నారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ నిర్వహించి ఉపాధ్యాయుల కొరత తీర్చాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాలన్నారు. గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలకు పక్కా భవనాలు నిర్మించి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ధర్నా సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థి సంఘాలను అరెస్టు చేసి తీసుకెళ్తుండగా విద్యార్థులు అడ్డుకున్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో మహాధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సెపక్ తక్రా పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సెపక్ తక్రా సబ్ జూనియర్ రాష్ట్ర జట్టుకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు సెపక్ తక్రా జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గాదారి సంజీవ్‌రెడ్డి తెలిపారు. జిల్లాకు చెందిన సాత్విక్‌రెడ్డి, బావిక్‌లు తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ పోటీలు కేరళ రాష్ట్రంలో జరుగనున్నాయని తెలిపారు.

తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారిణి

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారిణి సాయిప్రసన్న ఎంపికైనట్లు తైక్వాండో చైర్మన్ బస్వా లక్ష్మీనర్సయ్య, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్‌లు తెలిపారు. ఈనెల 26 నుంచి 28 వరకు జరిగిన అండర్-14 ఎస్‌జీఎఫ్ క్రీడల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు నవంబర్ 7 నుంచి 12 వరకు మధ్య ప్రదేశ్‌లో జరుగనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సాయిప్రసన్నను చైర్మన్ బస్వాలక్ష్మీనర్సయ్య, కార్యదర్శి మనోజ్‌కుమార్‌లు అభినందించారు.

అవగాహన వారోత్సవాలు ప్రారంభం

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయ ఆవరణలో ఏపీటీఎస్ కార్యాలయంలో విజిలెన్స్ సీఐ గోవర్ధన్‌రెడ్డి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటిరోజు అవినీతి మరియు దేశ ఆర్థిక వ్యవస్థను ఆటంకపరిచే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని దేశ అభివృద్ధికి దోహదపడాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ వృత్తిలో అందరూ అవినీతి రహితంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ గోవర్ధన్, ఎస్సై భరత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలకు మృతదేహం అందజేత

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలకు రెడ్‌క్రాస్ సొసైటీ నిజామాబాద్ శాఖ ఆధ్వర్యంలో మృతదేహాన్ని అందజేశారు. బోధన్‌లో చనిపోయిన కమల మృతదేహాన్ని వారి కూతుర్లు ఆదేశానుసారం సోమవారం జిల్లా ప్రభుత్వ కళాశాల ప్రయోగశాలకు అందించారు. కమల చనిపోకముందు తన కూతుర్లు అయిన స్వర్ణలత, హేమలతకు మృతి చెందిన అనంతరం ప్రయోగశాలకు ఇవ్వమని కోరనడంతో తల్లి కోరిక మేరకు మృతదేహాన్ని రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ద్వారా ప్రయోగశాలకు అందించడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు రెడ్‌క్రాస్ ద్వారా 14 మృతదేహాలను ప్రభుత్వ కళాశాలకు అందించడం జరిగిందని రెడ్‌క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోటరాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రవీణాపాల్, బాల్‌రాజ్, బంధువులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

రూరల్ ఎమ్మెల్యేకు మిట్టపల్లి వీడీసీ సభ్యుల వినతి

డిచ్‌పల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన బీఆర్ఎస్ నాయకుడు మిట్టపల్లి రేషన్ డీలర్ ఒడ్డం నర్సయ్యపై చర్యలు తీసుకోవాలని మండలంలోని మిట్టపల్లి వీడీసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీడీసీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని పెద్ద ఒర్రె, బురుగు చెరువు కట్ట, మానిక్యాల దేవి భూమి, ఉడల పెద్దమర్రికికి సంబంధించిన సుమారు రెండు ఏకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే గ్రామ రేషన్ పంపిణీలో, బియ్యం తూకంలో అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఒడ్డం నర్సయ్యపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమి ని కబ్జా నుంచి విడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్ష, కార్యదర్శులు బాలగంగాధర్, తంగెళ్ల కిసన్, కోశాధికారి ప్రదీప్, సభ్యులు మంత్రి నారాయణ, అబిబ్ ఖాన్, వడ్ల గంగాధర్, శ్రీనివాస్, లింబాద్రి, సాయికుమార్, రవి, రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తలకు డిజిటల్ సభ్యత్వ నమోదును చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అక్టోబర్ 26 నుంచి 40 రోజుల పాటు కొనసాగుతుందని అన్నారు. క్రియాశీలక కార్యకర్తలు ఎవరైనా మరణిస్తే ఖర్చుల నిమిత్తం 10వేలు ఇచ్చే విధంగా కార్యచరణ రూపొందించాలన్నారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉన్న వారికి గతంలో 2లక్షల ప్రమాదబీమా ఉంటే ప్రస్తుతం 5లక్షలకు పెంచడం జరిగిందన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన నాయకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, జ్యోతినారాయణ, అంబిక సత్యనారాయణ, బొబ్బ నర్సింహ, శ్రీనివాస్‌బాబు, ఆనంద్, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిఎన్నిక

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శిగా రమేష్‌బాబు మూడవ సారి ఎన్నికయ్యారు. రాష్ట్ర మహాసభల అనంతరం 14 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. నగరంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులుగా పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, శంకర్‌గౌడ్, వెంకటేశ్, నాగన్న, జిల్లా కమిటీ సభ్యులుగా ఏశాల గంగాధర్, నన్నెసాబ్, జంగం గంగాధర్, సుజాత, కొండ గంగాధర్, సురేష్, రామ్మోహన్‌లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

మార్కెట్ కమిటీ ఆదాయం సమకూర్చడానికి అన్ని చర్యలు

ఖిల్లా, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయాన్ని సమకూర్చడానికి అన్ని చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. తన చాంబర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ... మార్కెట్‌కు రావాల్సిన ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ముఖ్యంగా మొబైల్ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి మార్కెట్ రుసుము(ఫీజ్) వసూలు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి రైస్ మిల్లర్లు చెక్ పోస్టుల వద్ద రైతు ఉత్పత్తులతో వచ్చే వాహనాలను నిలిపి అందుకు సంబంధించిన అన్ని పత్రాలను చూపాలన్నారు. అంతకుముందు యార్డ్‌లోని రైతు వసతిగృహం, ఇంజనీరింగ్ శాఖ కార్యాలయం, యార్డ్‌లో గల గోదాములను వైస్ చైర్మన్ రాంచందర్‌రావ్, స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణ, డైరక్టర్లతో కలిసి పరిశీలించారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతను ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డిఆర్‌డివో సాయాగౌడ్, ఇంచార్జి డిపివో శ్రీనివాస్, నిజామాబాద్ ఏసిపి రాజావెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ ఆర్జీలను సమర్పించారు.

అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులు

ఖిల్లా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సీపీ సింధూశర్మ ఆదేశాల మేరకు అదనపు పోలీస్ కమీషనర్ కోటేశ్వర్‌రావు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎల్ఐసీ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా, పోలీస్ హెడ్‌క్వాటర్స్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో అదనపు పోలీస్ కమీషనర్ ఏఆర్ శంకర్ నాయక్, ట్రాఫిక్ ఏసీపి నారాయణ, నాగయ్య, టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజ్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు

ఎంఐఎం అధినేత ఫొటోపై.. సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

ఖిల్లా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈ నెల 26వ తేదీన సోషల్ మీడియాలో హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదొద్దీన్ ఓవైసీ ఫొటోపై దుష్ప్రచారం చేయడంపై ఒకటోటౌన్ పోలీసు స్టేషన్‌లో ఎంఐఎం నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ఎంఐఎం నాయకులు ఎంఏ.ముఖీద్, ముంబైకి చెందిన కలీమ్‌షేక్‌లు విలేకరులతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ ఎంపీ ఓవైసీ ఫొటోను సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కొందరు వ్యక్తులు కావాలనే ఇలా చేశారన్నారు. అలాంటి వారిపై తాము చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారిపై సెక్షన్ 353(1)(సి)356(2) భారతీయ శిక్షాస్మృతిలోని బీఎన్ఎస్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పోస్టులు ఎవరూ చేయకుండా పోలీసులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

శాస్త్ర సాంకేతికతకు గణితమే మూలాధారం

- టీయూ వీసీ రవీందర్ రావు

డిచ్‌పల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతికతకు గణితమే మూలాధారమని, ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త రామానుజచార్యుల ఆవిష్కరణలు ఈ ప్రపంచానికి అద్భుత ప్రగతిని అందించాయని టీయూ వీసీ రవీందర్ రావు అన్నారు. సోమవారం తెలంగాణ వర్సిటీలో గణిత శాస్త్రం నూతన ఆవిష్కరణలో కీలక పాత్ర అనే అంశంపై జరిగిన సెమినార్ ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాకతీయ వర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. గణిత శాస్త్ర అల్జజనరేషన్‌లో అనువర్తనీయం గురించి ట్రాఫిక్ వెయిటింగ్ తగ్గించే హియరింగ్ సెల్ ఫోన్, ల్యాబ్ టాబ్, కంప్యూటర్‌లలో గణిత శాస్త్రం ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో మ్యాథమెటిక్స్ హెడ్ ఆఫ్ డిపార్టుమెంట్ సైన్స్ డీన్ ప్రిన్సిపాల్ ఆరతి, టీజీ కాస్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వాసం చంద్రశేఖర్, బి.శ్రీనివాస్, పద్మ, చంద్రశేకర్, పలు కళాశాలల గణిత శాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలంగాణ వర్సిటీని అభివృద్ధి చేయాలి

డిచ్‌పల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అవినీతికి తావులేకుండా ప్రత్యేక చొరవ చూపాలని పీడీఎస్‌యూ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం టీయూ పీడీఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో వీసీ ప్రొ.యాదగిరి రావును కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ మాట్లాడుతూ.. కబ్జాకు గురవుతున్న వర్సిటీ భూములపై న్యాయపరంగా ముందుకెళ్లాలన్నారు. త్వరగా బాలికల వసతి గృహం భవన పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రిన్స్, వర్సిటీ కార్యదర్శి జయంతి, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

'తెలంగాణ శోధ్' పోస్టర్ ఆవిష్కరణ

డిచ్‌పల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీలోని వీసీ చాంబర్‌లో సోమవారం తెలంగాణ శోధ్ పోస్టర్‌లను టీయూ వీసీ ప్రొ.యాదగిరి రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశోధనల్లో లోతైన అధ్యాయనం జరగాలని, నూతన పరిజ్ఞానం ఏ విధంగా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్, టీయూ ఎబ్లికేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, ప్రతిజా, నారాయణ గుప్తా, శోధ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ బాపురెడ్డికి ప్రముఖుల నివాళి

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ జె.బాపురెడ్డికి జేఏసీ చైర్మన్ ఎమ్మెల్సీ కోదండరాం నివాళులర్పించారు. సోమవారం కోంపల్లిలోని డాక్టర్ బాపురెడ్డి నివాసంలో ఆయన భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన భౌతిక గాయం వద్ద మౌనం పాటించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో డాక్టర్ బాపురెడ్డి పాత్ర ఎంతో కీలకమైందన్నారు. తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన వ్యక్తి డాక్టర్ బాపురెడ్డి అన్నారు. అంతిమ యాత్రలో మాజీ శాసనసభ్యుడు యెండల లక్ష్మీనారాయణ, ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ గాదారి అనిత, జేఏసీ నాయకులు ప్రొఫెసర్ లింబాద్రి, గోపాల్‌శర్మ పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

డాక్టర్ బాపురెడ్డి మృతి తీరనిలోటని తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్, నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. సోమవారం నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో బాపురెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్‌క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, వెంకట్రాములు, గంగాకిషన్, ఈగ గంగారెడ్డి, దేవిదాస్, రాంరెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, ఏటిఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బైపాస్ సర్వే అడ్డుకున్న ప్లాట్ల యజమానులు

ఖిల్లా, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైల్వే బైపాస్ పనుల కోసం చేపడుతున్న సర్వే పనులను ప్లాట్ల యజమానులు అడ్డుకున్నారు. సోమవారం రైల్వే బైపాస్ పనులకు సర్వే నిమిత్తం వచ్చిన అధికారులను బైపాస్ రోడ్‌లో గల ఉన్న వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అడ్డుకున్నారు. లక్షల రూపాయలు కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను బైపాస్ కోసం ఎలా ఇస్తామని ప్రశ్నించారు. సుమారు 72 ప్లాట్ల వరకు కోల్పోవాల్సి వస్తుందన్నారు. రైల్వేశాఖ ఇస్తామంటున్న పరిహారం సరిపోదని పేర్కొన్నారు. అధికారులు సర్వే నిర్వహించకుండా లారీని అడ్డుగా పెట్టారు. దీంతో రైల్వే బైపాస్ పనులకు ఆటంకం ఏర్పడింది. ఈ సర్వేలో మండల సర్వేయర్ అనిత, ఆర్ఐ హరీష్, రైల్వే జూనియర్ ఇంజనీర్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.95	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	రూ.100	రూ.235	రూ. 255

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.81500	రూ.75200	రూ.1020

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : వేనం (తెలుగు 3డి) (11.25, 2.00)
: వేనం (ఇంగ్లీష్ 3డి) (4.35, 7.10, 9.45)
స్క్రీన్-2 : నరుడి బతుకు నటన (1.05)
: దేవర (4.00)
: జనక అయితే గనక (7.35)
: విశ్వం (10.35)
స్క్రీన్-3 : జనక అయితే గనక (1.20)
: పొట్టేల్ (4.20, 10.25)
: నరుడి బతుకు నటన (7.30)
స్క్రీన్-4 : ఎంత పని చేశావు చంటీ (11.00)
: లగ్గం (1.55, 7.50)
: సముద్రుడు (4.45)
: వెట్టయన్ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : లగ్గం (10.40, 4.40)
: విశ్వం (1.30, 7.30)
: వెట్టయన్ (10.40)
స్క్రీన్-2 : వేనం (తెలుగు 3డి) (11.00, 1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-3 : వెట్టయన్ (1.35)
: పొట్టేల్ (4.40, 10.40)
: దేవర (7.35)

దేవి : పొట్టేల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : విశ్వం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : వేనం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్